క్లుప్తంగా

బొజ్జ గణపయ్యకు ఘన నిమజ్జనం



అనుపోత్సవంలో లడ్డూకు పూజలు చేస్తున్న భక్తులు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు గొల్లపేటలో వినాయక చవితి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వియ్యపు పోతిరాజు ఆధ్వర్యంలో గణనాథుడి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం గ్రామ వీధుల్లో ఊరేగించారు. కోయ డ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గణనాథుడిని ముత్యాలమ్మపాలెం బీచ్‌లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వియ్యపు నరసింగరావు, అప్పలనాయుడు, చంద్రారావు, ముత్యాలయ్య, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు నేత్ర పరీక్షలు జరుపుతున్న కంటి వైద్య నిపుణులు

పరవాడ: విశాఖ ఫార్మాసిటీసౌజన్యంతో తాడి గ్రామంలో గురువారం రాంకీ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 95 రోగులను పరీక్షించారు. 16 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అర్హులైన వారికి కంటి ఆపరేషన్లు నిర్వహించడంతోపాటు, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పరవాడ మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు మాట్లాడుతూ రాంకీ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామానికి ఉచిత మంచినీటి సదుపాయం కల్పిస్తున్న రాంకీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి, ఏజీఎం లైజనింగ్ ఆఫీసర్ పీవీ రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, కోమటి సూరిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గెడ్డ వాగులో ఆక్రమణల తొలగింపు



పులగానిపాలెం గెడ్డ వాగులో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని పులగానిపాలెం సర్వే నెం.260/1లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఇక్కడ వాగు స్థలాన్ని ఆక్రమించుకుని కొందరు నిర్మాణాలు చేపట్టినట్లు తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు ఆయా అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ప్రభుత్వ స్థలాలు, గెడ్డ పోరంబోకు స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జేసీఐ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై సెమినార్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రమ్య

గాజువాక : జేసీఐ వైజాగ్ స్టీల్ సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చైతన్య మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాత్ వే టు పర్పస్ అనే అంశంపై సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ రమ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన వివిధ సందేహాలను నివృత్తి చేయడంతోపాటు వివిధ అంశాలపై సమాచారం అందించారు. అనంతరం యువత ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలను సేకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కామేశ్వరి, ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి, జేసీఐ అధ్యక్షుడు ధనుంజయ్, ప్రతినిధులు రవికుమార్, రమ, వి.లలిత తదితరులు పాల్గొన్నారు.



రూ.60 లక్షలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్డు



అతిథి గృహాల ప్రస్తుత దుస్థితి



గృహాలకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను అల్లుకుని పెరిగిన పిచ్చిమొక్కలు



పాడైన విద్యుత్ మీటర్ల పాయింట్

అప్పన్న సొమ్ము.. అరణ్యంపాలు

- సింహగిరిపై నిరుపయోగంగా అతిథి గృహాలు
- తొలుత గిరిజన గృహాలుగా నిర్మాణం
- ఆ తర్వాత అతిథి గృహాలుగా మార్పు
- రూ.1.20 కోట్ల అప్పన్న సొమ్ము వృథా
- 14 ఏళ్లుగా వినియోగానికి నోచుకోని వైనం



సింహగిరిపై నిరుపయోగంగా ఉన్న అతిథి గృహాలు



గృహాల చుట్టూ పేరుకుపోయిన తుప్పలు, గృహాల పైభాగంలో నాచు

సింహగిరిపై గిరిజనుల కోసం 14 ఏళ్ల క్రితం నిర్మించిన ఆవాసాలు నిరుపయోగమయ్యాయి. వీటిని రూ.లక్షలు వెచ్చించి అతిథి గృహాలుగా మార్చారు. అవి కూడా 11 ఏళ్లుగా వినియోగంలోకి తీసుకురాక శిథిలావస్థకు చేరాయి. అప్పన్న సొమ్ము రూ.కోటీ 20 లక్షలు అడవుల పాల్జేసిన దేవస్థానం అధికారుల నిర్లక్ష్యానికి శిథిల సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.

సింహాచలం: సింహగిరి హిల్‌టాప్ రోడ్డులో 14 ఏళ్ల క్రితం గిరిజనుల కోసం నిర్మించిన ఆవాసాలు దేవస్థానం అధికారుల నిర్లిప్తతకు నిదర్శనాలుగా మిగిలాయి. తొలుత గిరిజనుల వ్యక్తిగత గృహాల కోసం వీటిని నిర్మించారు. వాటిలో నివాసానికి గిరిజనులు విముఖత చూపడంతో, అతిథిగా గృహాలుగా మార్చారు. ఇందుకు దాదాపు రూ.35 లక్షలు వెచ్చించారు. ఈ రెండు చర్యలూ దేవస్థానం అధికారుల విజ్ఞతను దశాబ్ద కాలానికిపైగా ఎత్తిచూపుతూనే ఉన్నాయి.

గిరిజనులకు నచ్చని ఆవాసాలు

2008లో సింహగిరిని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేసే పనులను ప్రారంభించారు. ఆ సమయంలో సింహగిరిపై నివసిస్తున్న కొన్ని గిరిజనుల ఇళ్లను తొలగించాల్సి వచ్చింది. దీంతో వీరికి ప్రత్యామ్నాయ ఆవాసాలుగా ఆలయానికి పైభాగంలో హిల్‌టాప్ రోడ్డులో వ్యక్తిగత ఇళ్లు నిర్మించేందుకు 2009లో ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.25 లక్షలు వెచ్చించి 21 వ్యక్తిగత గృహాలను 2010లో నిర్మించారు. ఇళ్లకు వెళ్లేందుకు మరో రూ.60 లక్షలతో కిలోమీటరు పొడవున సీసీ రోడ్డు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే గిరిజనులెవరూ ఆ గృహాల్లోకి వెళ్లేందుకు సాహసించలేదు. కొండకు బాగా పైన ఉండటం, ఇరుకిరుగ్గా నిర్మించడంతో వారెవరూ ఇష్టపడలేదు. దాంతో రెండేళ్లపాటు గిరిజన గృహాలు నిరుపయోగంగానే మారాయి.

ఆతిథ్యానికీ నోచుకోలేదు!

2012లో అప్పటి దేవదాయశాఖ కమిషనర్ జేఎస్‌వీ ప్రసాద్ సింహగిరికి వచ్చినప్పుడు నిరుపయోగంగా ఉన్న గృహాలను చూశారు. వాటిని అతిథి గృహాలుగా మార్చాలని అధికారులను ఆదేశించారు. దాంతో మరో రూ.35 లక్షలు వెచ్చించి 15 గృహాలను అన్ని హంగులతో అతిథి గృహాలుగా దేవస్థానం అధికారులు మార్చారు. సింహగిరికి వచ్చే భక్తులకు వాటిని అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయించారు. 2013లో అప్పటి దేవదాయశాఖ మంత్రిగా ఉన్న సి.రామచంద్రయ్య చేతుల మీదుగా వీటికి ప్రారంభోత్సవం చేశారు. 11 ఏళ్లు దాటుతున్నా ఇప్పటికీ అవి అతిథుల సేవకు నోచుకోలేదు. వీటిని చేరాలంటే అప్పన్న కొండ దాటి కిలోమీటర్ పైగా పైకి నడిచి వెళ్లాలి. దీంతో సింహాద్రి అప్పన్న భక్తులు ఎవరూ అందులో చేరేందుకు ఆసక్తి చూపని దుస్థితి.

వదిలించుకోవాలని చూసినా..

2020లో దేవస్థానం ఈవోగా పనిచేసిన ఎం.వెంకటేశ్వరరావు గృహాల సముదాయాన్ని పరిశుభ్రం చేయించి, బహిరంగ వేలంపాట ద్వారా లీజుకిచ్చేందుకు ఉపక్రమించారు. ఆ ప్రతిపాదనలూ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం చెత్తా చెదారంతో గృహాలన్నీ శిథిలావస్థకు చేరాయి. ఎటుచూసినా అపరిశుభ్ర వాతావరణం. ఈ ప్రదేశానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి. చుట్టూ ఎటుచూసినా పూర్తిస్థాయి అరణ్య వాతావరణం కనిపిస్తుంది. అసలు ఈ ప్రదేశంలో గిరిజన గృహాలను నిర్మించాలన్న ఆలోచనను ఆదిలోనే చాలా మంది తప్పుబట్టారు. ఆ తర్వాత అతిథి గృహాలుగా మార్చి అప్పన్న సొమ్ము మరింతగా వృథా చేశారన్న అపప్రదమూటగట్టుకున్నారు.

అప్పన్న ఖజానాకు గండి పడిందిలా..

2010లో కట్టిన వ్యక్తిగత గృహాలు	21
నిర్మాణానికి అయిన ఖర్చు	రూ.25 లక్షలు
ఒక్కో గృహానికి వెచ్చించిన మొత్తం	రూ.1.19 లక్షలు
2012లో అతిథి గృహాలుగా మార్చినవి	15
అతిథి గృహాలుగా మార్చడానికి ఖర్చు	రూ.35 లక్షలు
సీసీ రోడ్డు, విద్యుత్ లైన్ల వ్యయం	రూ.60 లక్షలు

పర్యాటక శాఖతో సంప్రదింపులు



అతిథి గృహాలను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకశాఖకి వాటిని అప్పగించే ఆలోచన కూడా చేస్తున్నాం. ఈ మేరకు టూరిజం అధికారులతో సంప్రదింపులు చేస్తున్నాం. త్వరలోనే తుప్పలు తొలగించి, శుభ్రం చేస్తాం

– ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

వచ్చే నెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి సన్నిధిలో వచ్చే నెల 3 నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మణిపురం క్షేత్రంలో నిత్యపూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. రోజుకో అవతారంలో అమ్మవారిని అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. 3న దుర్గాదేవి అలంకరణ, 4న బాలాత్రిపుర సుందరి, 5న గాయత్రీదేవి, 6న అన్నపూర్ణ, 7న లలితా త్రిపుర సుందరి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీదేవి, 10న రాజరాజేశ్వరీదేవి, 11న దుర్గాదేవి, 12న కుమారి దేవి అలంకణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. ఆయా రోజుల్లో ఆయా దేవతల ఇష్ట నైవేద్యాలతో అమ్మవారిని పూజించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: సుజాతనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాపయ్యరాజుపాలెం, సుజాతనగర్, గోపాలకృష్ణనగర్, అంజనేయులునగర్, గిరిప్రసాద్‌నగర్, టీచర్స్ లేఅవుట్, నాగమల్లి లేఅవుట్, పెట్రోల్‌బంక్ ప్రాంతం, సుజాతనగర్ ఏ–జోన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

అప్పన్న అన్న ప్రసాదానికి విరాళాలు



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు



చెక్కు అందిస్తున్న దాత వసంతలక్ష్మి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని మల్కాపురానికి చెందిన కాపు దుర్గేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని నగదురూపంలో, శివాజీపాలేనికి చెందిన కోన వసంతలక్ష్మి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాద బాండ్లను ఏఈవో పిల్లా శ్రీనివాసరావు అందజేశారు. వారికి స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, అన్నప్రసాద విభాగం ఉద్యోగి కాశి పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకానికి 4,554 దరఖాస్తులు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విశ్వకర్మ పథకానికి సబ్బవరం మండలంలోని 24 పంచాయతీల నుంచి 4,554 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో రమేష్‌నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించాక 422 మంది టైలర్లు, 30 మంది మేస్త్రీలను అర్హులుగా గుర్తించామన్నారు. అత్యధికంగా సబ్బవరం పంచాయతీ నుంచి, అత్యల్పంగా రాయపుర అగ్రహారం నుంచి అర్హులున్నట్లు పేర్కొన్నారు. సబ్బవరం పంచాయతీ నుంచి 1,044 మంది దరఖాస్తు చేసుకోగా 97 మంది టైలర్లు, ఒక మేస్త్రీ, రాయపుర అగ్రహారం నుంచి 47 దరఖాస్తులు రాగా ఒక టైలర్ మాత్రమే ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ జాబితాను ప్రభుత్వ అమోదం కోసం పంపించినట్లు పేర్కొన్నారు.

ఈ క్రాప్ రైతుల ఈకేవైసీ తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



అమృతపురంలోని రైతు సేవాకేంద్రంలో ఈకేవైసీని పరిశీలిస్తున్న మోహన్‌రావు

సబ్బవరం: ఈ క్రాప్ పూర్తిచేసుకున్న రైతులంతా ఈకేవైసీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని అమృతపురం గ్రామం రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాల వలన జరిగిన పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల జాబితాలను సిద్ధం చేసి గ్రామ కమిటీ, మండల కమిటీలతో ఆమోదించి వెంటనే జిల్లా కేంద్రానికి పంపించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ నెల 15 నాటికి ఈ క్రాప్ రైతుల ఈకేవైసీలను పూర్తి చేసి, జాబితాలను సామాజిక తనిఖీల కోసం ప్రదర్శించాలని వీపీఏలను ఆదేశించారు. భారీ వర్షాల తర్వాత వరిపంటలో తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య, పి.భావన తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 46 మందికి ఉపాధి



మాట్లాడుతున్న సుబ్బిరెడ్డి



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

పెందుర్తి: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు చక్కని స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ జాబ్‌మేళాకు 139 మంది హాజరు కాగా అందులో హెరిటో ల్యాబ్స్‌లో 25 మంది, కేఎల్ గ్రూప్‌లో 21 మంది ఉపాధి లభించిందన్నారు. ఫైజర్ కంపెనీలో ఐదుగురిని షార్ట్‌లిస్ట్ చేయాల్సి ఉందని వెల్లడించారు. అవి కూడా ఖరారైతే మొత్తం 51 మందికి ఉపాధి లభించినట్లవుతుందన్నారు. జాబ్‌మేళాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీవీ సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాం తదితరులు

గాజువాక : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ సంబరాలు 2024 పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ గురువారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లల్లో సైన్స్ పట్ల జిజ్ఞాస పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసి బావి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గాజువాక మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు, ప్రతినిధులు గిరీష్ శ్రీనింఆస్, కె.వి.సత్యనారాయణ, ఎం.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకున్న ఉక్కును కాపాడుకుంటాం



దీక్షా శిబిరం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

అగనంపూడి: నిర్వాసితులు వేల ఎకరాల ధారాదత్తం, 32 మంది అమరుల ప్రాణ త్యాగంతో, పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామంటే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని, సమయం వచ్చినప్పుడు తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటనకు నిరసగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో 1,309 రోజుల నుంచి రిలే దీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అస్థిరపర్చి, కార్మికుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తోందని, ఇటువంటి దుశ్చర్యలను కార్మిక వర్గం వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా, పోరాటలు, ఉద్యమాలతో అడ్డుకుంటామన్నారు. తక్షణం ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, పూర్తి సామర్థ్యంతో ఉక్కును నడిపేందుకు వీలుగా ముడి సరుకులు అందివ్వాలని, అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, బీఎంఎల్ నాయుడు, పి.పెద్దిరాజు, బీవీ సత్యనారాయణ, సైన్‌బాబు పాల్గొన్నారు.

సామాజిక సేవలో గంగవరం పోర్టు



పెదగంట్యాడలోని ఓ గెడ్డలో పొక్లెయిన్ సాయంతో పూడిక తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: కష్ట సమయాల్లో సమాజానికి అండగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అదాని గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు అన్నారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని అనేక గెడ్డలు పూడుకుపోయాయని, వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు విజయవాడ వెళ్లడంతో తమ వంతు సాయంగా యంత్ర పరికరాలు, ప్రత్యేక బృందాలను ఆయా జిల్లాలకు తరలించామని తెలిపారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ అదాని గంగవరం పోర్టు తన వంతు ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలో పూడుకుపోయిన గెడ్డలను శుభ్రం చేయించామని చెప్పారు. గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో తమ సేవలను విస్తరించామన్నారు. భారీ వర్షాలు కురిసే సమయంలో వర్షపునీరు సాఫీగా సాగిపోయేలా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. అలాగే రహదారుల్లో కూడా ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా, వర్షపునీరు నిలిచిపోకుండా ఉండేలా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత నెల 31 నుంచి సేవలు చేస్తున్నామని, ఇది తమ పోర్టు సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

క్రికెట్ లీగ్ విజేత 'గుడ్‌షెపర్డ్'

విశాఖ స్పోర్ట్స్: యునైటెడ్ ఇన్‌క్రెస్ట్ క్రిష్టియన్ క్రికెట్ లీగ్ విజేతగా గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చ్ నిలిచింది. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో గురువారంతో ముగిసిన టోర్నీ ఫైనల్‌లో గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చ్ నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్లకు 101 పరుగులు చేసింది. ప్రతిగా ట్రూలైట్స్ చర్చ్ మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. శ్రావణ్ 62 రన్స్ చేశాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో పలు క్రైస్తవ చర్చ్‌ల జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ విభాగపు అధ్యక్షుడు జాన్‌వెస్లీ హాజరై విజేతలకు ట్రోఫీ అందించారు.

సోలార్ రూఫ్ టాప్‌లపై అవగాహన



సోలార్ రూఫ్ టాప్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు

పెదగంట్యాడ: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన అనేది భారత దేశంలోని గృహాలకు అతి తక్కువ విద్యుత్ బిల్లుల ను అందించడానికి ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకం అని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జికూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు తెలిపారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు రామాలయం వద్ద గురువారం గ్రామస్తులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్దిదారులు తమ గృహాలపై కప్పుల పై సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి తక్కువ ఖర్చుతో సౌర విద్యుత్ వెలుగులు పొందే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీని ద్వారా పవర్ కట్ సమస్య కూడా ఉండదన్నారు. సామాన్యులకు విద్యుత్ చార్జీలు భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. తీసుకోదలచిన క్యూఆర్ కోడ్ ద్వారా కానీ ఏపీ ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా, పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సోలార్ వినియోగం, రాయితీలపై సదస్సు నేడు

అగనంపూడి: సోలార్ వినియోగం, బ్యాంక్‌ల నుంచి వినియోగదారులకు అందే రాయితీలపై అగనంపూడి సీడబ్ల్యూసీలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తు అంతా పునరుత్పాదక ఇంధన వనరైన సౌర శక్తి మీదే ఆధారపడి ఉంటుందన్నారు. సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతోపాటు, అదనపు విద్యుత్‌ను విక్రయించి, ఆదాయం సంపాదించవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమంలో భాగంగా సోలార్ వినియోగం పెంచడంతోపాటు వినియోగం వల్ల కలిగే లాభాలు, యూనిట్ ఏర్పాటునకు ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా అందించే రాయితీలపై వివరిస్తామన్నారు.